క్లుప్తంగా

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సంగెం : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించడమే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. హనుమకొండలోని తన నివాసంలో సంగెం మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేసి బీఆర్ఎస్ జెండా ఎగరేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. సీఎంగా కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. ఎన్నికల హామీలను విస్మరించి ఓటు ఎలా అడుగుతారని కాంగ్రెస్ నాయకులను విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఆదరణ తగ్గిందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, వైస్ ఎంపీపీ మల్లయ్య, నాయకులు సాగర్‌రెడ్డి, మల్లయ్య, రాజు, దిలీప్‌రావు, శ్రీనివాస్, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద గ్రామంలో స్థానిక ఆరోగ్య ఉపకేంద్రం–2 ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం సరోజ మాట్లాడారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వీలైనంత వరకు ఉదయమే పనులు ముగించుకోవాలని సూచించారు. పనివేళల్లో తరచూ మంచినీళ్లు తాగాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు, ఏఎన్ఎం అపరంజి, ఆశ కార్యకర్తలు శోభ, కోమల, ఉపాధి అసిస్టెంట్ రేణుక, పంచాయతీ సిబ్బంది, రాజు, చోటే, వేణు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన అజ్మీర లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.3 వేల సాయం అందజేశారు. ఆ పార్టీ నాయకులైన అల్లం మర్రెడ్డి, మాదాసి రాంబాబు, కందికొండ రాజ్‌కుమార్, తోట కమలాకర్, బాదావత్ కృష్ణ తదితరుల ద్వారా బాధిత కుటుంబానికి పంపించారు.

నూతన ఆవిష్కరణలను పెంచుకోవాలి

నర్సంపేట రూరల్ : ఫార్మసీ విద్యార్థులు నూతన ఆవిష్కరణలను పెంచుకోవాలని కేయూ ఫార్మసీ విభాగం డీన్ సమ్మయ్య సూచించారు. నర్సంపేట మండలంలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో 'ఇంపాక్ట్ లెక్చర్ సిరీస్' అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సుకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఐఐఎఫ్‌టీ విద్యార్థులు వ్యవస్థాపక లక్షణాలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రొఫెసర్ మురళీధరన్, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, విభాగాధిపతులు డాక్టర్ మనీశ్, పీ.రవి, జె.రవి పాల్గొన్నారు.

లారీ ఓనర్‌పై భౌతిక దాడి

గీసుకొండ : ఫారూఖ్ అలీ, హర్షద్ అలీ, యాకూబ్, ఆసిఫ్ అలీ అనే వ్యక్తులు తనపై భౌతిక దాడికి పాల్పడ్డట్లు వరంగల్ నగరంలోని కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన లారీ ఓనర్ ఠాకూర్ రాకేశ్ సింగ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. రాకేశ్‌సింగ్ గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో సభ్యుడు. ఈనెల 6న అసోసియేషన్ అధ్యక్షుడు ఫిరోజ్ అలీ నిబంధనలకు విరుద్ధంగా లారీలో 15 టన్నులకు బదులు 25 టన్నులు లోడ్ చేసుకుని వెళ్తుండగా అడ్డుకుని అసోసియేషన్ ఆఫీసుకు తరలించారు. తదనంతరం వాచ్‌మెన్‌ను బెదిరించి లారీని తీసుకెళ్లగా అసోసియేషన్ ఆఫీసు వద్ద సభ్యులతో రాకేశ్‌సింగ్ మాట్లాడుతుండగా ఫారూఖ్ అలీ, హర్షద్ అలీ, యాకూబ్, ఆసిఫ్ అలీ దాడి చేసినట్లు తెలిపారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ నిబంధనలను పాటించకపోవడంతోపాటు అక్రమంగా ఎక్కువ లోడ్ చేశారని ప్రశ్నించినందుకు తనపై అసోసియేషన్ ప్రతినిధులు దాడి చేశారని రాకేశ్ సింగ్ వాపోయాడు. ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

పేరుకే 24 గంటలు

- పీహెచ్‌సీలో అందని నిరంతర వైద్య సేవలు
- కాగితాలకే పరిమితమైన రౌండ్‌క్లాక్
- సిబ్బంది కొరతే ప్రధాన కారణం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రౌండ్‌క్లాక్‌గా ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా సేవలు మాత్రం అందడం లేదు. పీహెచ్‌సీలో రోజువారి ఓపీతో పాటు గర్భిణులకు పరీక్షలు, వ్యాక్సినేషన్, రోగనిర్ధారణ పరీక్షలు, దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. పీహెచ్‌సీ సిబ్బంది నిత్యం 150 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే స్థానిక రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు బుధవారం, శనివారం టీకాలు, మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు, గర్భిణులు, బాలింతలు, మహిళలు, శిశువులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీలో ఒక వైద్యాధికారి, స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టు, సీహెచ్‌ఓ పీహెచ్‌సీ, సబ్ సెంటర్లకు కలిపి 12మంది ఏఎన్ఎంలు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. సిబ్బంది కొరతతో 24గంటలు వైద్యసేవలు అందని ద్రాక్షగా మారాయి. పీహెచ్‌సీకి అదనపు డాక్టర్, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్, ఇద్దరు మేల్ సూపర్‌వైజర్ల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. సాయంత్రం తర్వాత రోగులు ఆస్పత్రికి వస్తే సిబ్బంది కొరతతో వైద్య సేవలు అందడం లేదు. రాత్రి వేళ స్టాఫ్‌నర్సు సేవలు కూడా కష్టంగా మారాయి. దీంతో రోగులు అత్యవసరమైతే ప్రైవేటు ఆస్పత్రికి పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఆస్పతికి రోగుల తాకిడి ఉండడంతో పనిభారం పడుతోందవని వైద్య సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. సరిపడా సిబ్బందిని నియమించి 24 గంటల వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అదనపు సిబ్బంది అవసరం



పీహెచ్‌సీలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యసేవలు ఇబ్బంది లేకుండా అందిస్తున్నాం. పూర్తి స్థాయిలో స్టాఫ్ లేకపోవడంతో నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి రోగుల తాకిడి ఉంటుంది. దాంతో పాటు ఆరోగ్య మహిళా కార్యక్రమం చేపడుతున్నాం. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నాం. ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం కలిగించే విధంగా సేవలు అందిస్తున్నాం. సిబ్బంది కొరత ఒక్కటే ఇబ్బంది పెడుతోంది. ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేశాం. సిబ్బందిని భర్తీ చేస్తే రౌండ్‌క్లాక్ సేవలు అందుతాయి.

– స్పందన, పీహెచ్‌సీ వైద్యాధికారి

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

- విద్యుత్‌శాఖ ఏఈ గుర్రం రమేష్

దామెర : విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఏఈ గుర్రం రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా అనాలోచిత నిర్ణయాల వలన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. మరమ్మతులు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిన చోట ఎర్త్‌వైర్లకు నీరు పట్టించడం జరుగుతుందన్నారు. సిబ్బంది వినియోగదారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలలో అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. సబ్ ఇంజనీర్ చందన, లైన్ ఇన్స్‌పెక్టర్ రవీందర్, వేణుగోపాల్, లైన్‌మెన్ మనోహర్, సురేష్, రవీందర్, జేఎల్ఎంలు కృష్ణ, రాజశేఖర్, అన్‌మ్యాన్డ్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

'గురుకులం' లో ఉచిత కంటి వైద్య పరీక్షలు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురుకుల ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి లోపమున్న 358 విద్యార్థినులకు అద్దాలు అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ రమాన్ తెలిపారు. డాక్టర్ మనోహర్, డాక్టర్ ప్రణీత, రవీందర్‌రెడ్డి, సిబ్బంది కేఎల్ఎన్ స్వామి, పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులు భార్గవి, ప్రేమలత, ఏఎన్ఎమ్‌లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



వంగరలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

నీటిఎద్దడి తలెత్తకుండా చూడాలి

- మండల స్పెషలాఫీసర్ వెంకటనారాయణ

పరకాల : గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం తాగునీటి ఎద్దడి నివారణపై గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎండల తీవ్రతతో పాటు భూగర్భజలాలు అడుగంటుతున్న దృష్ట్యా తాగునీటి సరఫరాపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రజలకు ఎండదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అదే విధంగా అమ్మ ఆదర్శ పాఠశాలలో మంజూరు చేయబడిన పనులను జూన్ 10లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించొద్దని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎంపీఓ ఇమ్మడి భాస్కర్, మండల వైద్యాధికారి స్వాతి, మండల విద్యాధికారి ఎస్.రమాదేవి, ఏఈ రాజు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

మద్యం స్వాధీనం



ఐనవోలు : పున్నేలు గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న రావుల రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. బెల్టుషాపు నిర్వహిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు అతడి ఇంటివద్ద తనిఖీలు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో రూ.7,821 విలువగల మద్యం బాటిళ్లు లభించగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు ఆయన చేసినట్లు తెలిపారు.

కుట్టుమిషన్ శిక్షణతో మహిళలకు ఉపాధి

శాయంపేట : కుట్టుమిషన్ శిక్షణతో మహిళలకు ఉపాధి లభిస్తుందని ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం పాలకవర్గ సభ్యుడు కోసరి గోపాల్ అన్నారు. మండలంలోని కొత్తగట్టుసింగారంలో సోమవారం ప్రజ్వల్ క్షేత్ర సిబ్బంది ఏర్పాటు చేసిన జాతీయ అకాడమీ కన్‌స్ట్రక్షన్ ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న 90 రోజుల ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు కుటుంబ అవసరాలకు చేదోడువాదోడుగా ఉండేందుకు కుట్టుమిషన్ శిక్షణ దోహదపడుతుందన్నారు. అలాగే ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో అర్హత సాధించేందుకు కుట్టుమిషన్ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు కుట్టుమిషన్ శిక్షణ పొంది కుటుంబానికి అండగా ఉండడంతో పాటు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం పాలకవర్గ సభ్యులు రజిత, రాజేశ్వర్‌రావు, ఎస్‌పీసీ ప్రతినిధులు సురేందర్, రాజకుమారి, పీయూ మేనేజర్ ప్రియాంకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఐనవోలు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అహ్లాదంగా గడిపారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుమారు 80 మంది పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కిషన్‌రావు, రాజ్‌కుమార్ సింగ్, సంపత్, పూర్వ విద్యార్థులు అశోక్, చిన్నరాజు, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

ఆత్మకూరు : మండలంలోని కొత్తగట్టు గ్రామంలో గల ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మాజీ సర్పంచ్ బోల్ల నరేష్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో విలేజ్ పార్కు కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మండలస్థాయి అధికారులకు సైతం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

పరకాల : మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే పట్టణ ప్రజలు ఫిర్యాదు చేయొచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత తెలిపారు. ఈ మేరకు సోమవారం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. తాగునీరు రాకపోవడంతోపాటు పైపులు లీకేజీ అయితే 99890 91103 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సంస్కృతిపై అవగాహన కలిగిఉండాలి



ఉగాది వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఐనవోలు : విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేందుకు తెలుగు తొలిపండుగైన ఉగాది వేడుకలను ముందస్తుగా నిర్వహించినట్లు ఐనవోలు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు తెలుగు మాసాలు, రుతువులు, సంవత్సరాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రకృతిని ఆధారంగా చేసుకుని తెలుగు పండుగలు ఉంటాయని వివరించారు. చైత్ర మాసం తొలిరోజు వసంత రుతువులో ఉగాది పండుగ జరుపుకొంటామని అన్నారు. ఉగాది పండుగరోజు మామిడి, చింత, వేప, కారం, చెరుకు, ఉప్పు కలిపిన షడ్రుచుల పచ్చడి తయారు చేసి ఆరగిస్తారని చెప్పారు. మానవ జీవితం కూడా షడ్రుచుల సమ్మేళనంగా మంచి, చెడు, కష్ట, సుఖాలు, చీకటి వెలుగుల మిశ్రమంగా ఉంటుందనే జీవిత సత్యాన్ని ఉగాది పండుగ తెలియజేస్తుందన్నారు. ప్రతిఒక్కరు ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలు చిన్నతనం నుంచే అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులకు 'క్రోధి' తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉగాదిని కుటుంబ సమేతంగా సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మధుకర్, సారయ్య, మహేందర్, లక్ష్మయ్య, శైలజ, పద్మ, సరళ, సునీత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

నడికూడ : భార్య కాపురానికి రావడంలేదని మనస్థాపం చెందిన భర్త పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని సర్వాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అన్నెబోయిన సుమన్ (33)కు దామెర మండలం కోగిలవాయ్ గ్రామానికి చెందిన రాజేశ్వరితో 2018 సంవత్సరంలో వివాహం జరిగింది. కొంతకాలంగా భార్యభర్తల మధ్య మనస్పర్థాలు రావడంతో రాజేశ్వరి పుట్టింటిలోనే ఉంటుంది. భార్య కాపురానికి రావడంలేదని మనస్థాపం చెందిన సుమన్ ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగి కిందపడిపోయాడు. గమనించిన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం పరకాల ఆస్పత్రికి తరలించారు. కానీ సుమన్ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దామెర ఎస్సై కొంక అశోక్ వెల్లడించారు.



సుమన్ (ఫైల్)

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

వర్ధన్నపేట : రంజాన్, ఇతర పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చెప్పారు. రంజాన్‌ను పురస్కరించుకుని పట్టణ కేంద్రంలోని జామా మజీద్‌లో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో హిందూముస్లింలు అన్నదమ్ముల్లా కలిసి ఉంటారని చెప్పారు. మతతత్వ రాజకీయాలను ఎట్టి పరిస్థితిలోనూ సహించేది లేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, సీనియర్ నాయకులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రంజాన్ మాసం పవిత్రమైనది

నర్సంపేట : రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైనదని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సాంబయ్యగౌడ్ తెలిపారు. పట్టణంలోని 22వ డివిజన్‌లోని తాజ్ ఖుర్షీదా మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మౌల్వీసాబ్ సాహెబ్ రాజా, అఖిల్ పాషా, ముస్లిం మత పెద్దలు ఆసీఫ్, ఖలీల్, జలీల్, మహబూబ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు వేముల సారంగం, సీనియర్ నాయకుడు దండెం రతన్‌కుమార్, పట్టణ కార్యదర్శి నాంపల్లి వెంకటేశ్వర్లు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కటారి ఉత్తమ్‌కుమార్, 22వ డివిజన్ జనరల్ సెక్రటరీ తొగరు దేవేందర్, నాయకులు జిజుల కార్తీక్, దేశీ సందీప్, రాసమల్ల బాలు, తదితరులు పాల్గొన్నారు.

పల్లారుగూడలో..

సంగెం: మండలంలోని పల్లారుగూడలోని మసీదులో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాసమున్న వారికి స్వీటు తినిపించి విరమింపజేశారు. ఇమామ్ అజ్మత్ అలీ, మౌజన్ యాకూబ్ అలీ, ప్రెసిడెంట్ సాహబ్ అలీ, నాయకులు ఫక్రుద్దీన్, జియా, అక్రమ్, కాంగ్రెస్ నాయకులు బొమ్మల రాజ్‌భరత్, పోశాల రజని, తీటి రాములు, తప్పెట్ల రమేష్, ఓదెల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా

పర్వతగిరి : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ తెలిపారు. మండలంలోని శ్రీనగర్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు కోరిటాల సుబ్బారావు, గుమ్మడి ప్రసాదరావు, ఉపసర్పంచ్ గుమ్మడి విజయ్‌భాస్కర్ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, పార్లమెంట్ అభ్యర్థి రమేశ్ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ధర్మారావు, రమేశ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముమ్మరంగా యాసంగి వరికోతలు

- మండల వ్యాప్తంగా 4,600 హెక్టార్లలో మేల్, ఫిమేల్ సాగు
- హార్వెస్టర్లతో కోతలు షురూ

ఎల్కతుర్తి : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో యాసంగి వరికోతలు షురూ అయ్యాయి. యాసంగి ధాన్యం కొంటామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు కోతలకు ముందుగానే ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించడంతో రైతులు వరికోతలపై దృష్టి పెట్టారు. హార్వెస్టర్ యంత్రాల సహాయంతో వరికోతలు మొదలు పెట్టారు. మండల వ్యాప్తంగా సుమారుగా 17వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇందులో 4,600 ఎకరాల్లో మేల్, ఫిమేల్ వరిని సాగు చేశారు. మిగతా శాతం సాధారణ వరి రకాలను సాగు చేశారు. మేల్, ఫిమేల్ వరి పైర్లు సైతం కోతదశకు చేరుకుంటున్నాయి. మెట్ట ప్రాంతాల్లో సాగు చేసిన వరిపంటకు చివరి దశలో సాగు నీరందక అక్కడక్కడ ఎండిపోయి పశువులకు మేతగా మారింది. ఈ సారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో రైతులు ఉత్సాహంగా వరికోతలు మొదలు పెట్టి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు.



ధాన్యాన్ని ట్రాక్టర్‌లో పోస్తున్న హార్వెస్టర్



వరిని కోస్తున్న హార్వెస్టర్



కోతకు వచ్చిన పొలం

పట్టణంలో చలివేంద్రం ఏర్పాటు

సాక్షి స్పందన



పరకాల: ఎండ తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో ప్రయాణికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఈనెల 7వ తేదీన సాక్షిలో ప్రచురితమైన 'దంచి కొడుతున్న ఎండలు' కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సింహ, సానిటేషన్ అధికారి వెంకట్‌రెడ్డి, జవాన్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.